క్లుప్తంగా...

నేడు ఉద్యమనేతల రౌండ్‌టేబుల్ సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో నేడు (25న) టీఎస్ జాక్, ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో విద్యార్థి ఉద్యమ నేతలు అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. నేడు (25న) ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ డిపార్టుమెంట్ సెమినార్ హాల్లో ఉదయం 10.30 లకు జరిగే రౌండ్ టేబుల్ సమావేశానికి పార్టీలకు అతీతంగా ఉద్యమ విద్యార్థులు హాజరు కావాలని టీఎస్ జాక్ జేఏసీ చైర్మన్ డాక్టర్ రుద్రవరం లింగస్వామి తెలిపారు. ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రతి పార్టీ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలని విద్యార్థి నేతల డిక్లరేషన్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాదె వెంకట్, ఆర్ఎల్ మూర్తి, పూసల రమేష్, పాల్వాయి నగేష్, మండ్ల రవి, వెంకట్, దర్శన్, అశోక్‌నాయక్, అజయ్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ హట్స్‌లో ఉచిత వైద్య పరీక్షలు



మడ్‌ఫోర్ట్‌లో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రసూల్‌పురా: సేవాభారతి తెలంగాణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్ హట్స్‌లో ఈసీఐఎల్, ఎయిమ్స్ బీబీనగర్ వైద్యుల సహకారంతో ఆదివారం ఆడపిల్లలకు అనీమియా వైద్య పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సేవా భారతి తెలంగాణ అధ్యక్షులు దుర్గా రెడ్డి మాట్లాడుతూ.. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో నాలుగు బస్తీల్లో ఈ వైద్య పరీక్షలు నిర్వహించి పౌష్టికాహారం, మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆడపిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండి పౌష్టికాహార లోపం లేకుండా చూడడం సేవా భారతి ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో రామ్మూర్తి, మంజూష, రాజేందర్‌రావు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

- నలుగురిపై కేసు

సనత్‌నగర్: అర్ధరాత్రి ఓ యువకుడిపై తీవ్రంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటనలో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సబ్ ఇన్‌స్పెక్టర్ రవిరాజ్ కథనం ప్రకారం.. బల్కంపేటకు చెందిన సందీప్ (24), అతని మిత్రులు దినేష్, రోహిత్ శనివారం అర్ధరాత్రి బాపూనగర్ ప్రాంతంలోని లక్కీ రెస్టారెంట్‌కు భోజనం చేసేందుకు వచ్చారు. ఆ సమయంలో అక్కడ ఉన్న సాగర్‌సింగ్ (35) సందీప్, అతని మిత్రులతో ఘర్షణ పడ్డాడు. అంతటితో ఊరుకోకుండా కుటుంబ సభ్యులను కూడా అక్కడికి పిలిచాడు. సాగర్‌సింగ్‌తో పాటు అతని తండ్రి ప్రీతమ్‌సింగ్, సోదరుడు భరతసింగ్, సోదరి సోనమ్ ప్రియాంక సందీప్‌ను తీవ్రంగా కొట్టారు. గమనించిన స్థానికులు బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. సందీప్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేశారు.

మహిళలకు హక్కులు, చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

పంజగుట్ట: కుల వ్యవస్థ, మనుధర్మం వల్లే మహిళల అణచివేతకు కారణమని ఉమ్మడి ఏపీ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చైతన్య మహిళా సంఘం 28వ ఆవిర్భావ సదస్సు నిర్వహించారు. సంఘం రాష్ట్ర కన్వీనర్ బి.జ్యోతి, కో కన్వీనర్ రాధ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హాజరైన జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ... స్త్రీలు తమ ఆధీనంలో ఉంచుకోవాలి అన్న దృక్పథం వల్లే దాడులు పెరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా మణిపూర్‌లో, ఇటీవల హైదరాబాద్ ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన గిరిజన మహిళపై దాడి విషయాలను ఆయన ప్రస్తావించారు. మహిళలు సమాజాన్ని అర్థం చేసుకోవాలని, విజ్ఞానం పెంచుకోవాలని హక్కులు, చట్టాలు తెలుసుకోవాలని సూచించారు. ప్రభుత్వాలు కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నాయని, గ్యాస్ ధర రూ. 1200 చేసి రూ. 200 తగ్గించారన్నారు. ప్రజాస్వామిక రచయితుల వేదిక కార్యదర్శి కాత్యాయని విద్మహే మాట్లాడుతూ... సనాతన ధర్మం నిరంతరం మారుతుందని వర్ణాశ్రమ కాలంలోనే తెలిపిందన్నారు. వారు మహిళలను ఎప్పుడూ బానిసలుగానే చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సనాతన ధర్మం మార్పుచెంది మనుధర్మం వచ్చి మహిళలను ఇంటికే పరిమితం చేశారని, వ్యక్తిత్వం లేని పురుషులపై ఆధారపడి ఉండేలా చేసిందన్నారు. అనంతరం అసంఘటిత రంగంలో మహిళలు అనే అంశంపై పలువురు వక్తలు ప్రసంగించారు.

మెరుగైన వైద్యం.. 'చిన్నగాంధీ'లో సాధ్యం!

- కార్పొరేట్ తరహా మెటర్నిటీ సెంటర్‌లో వైద్య సేవలు
- సాధారణ ప్రసవాలపై ప్రత్యేక శ్రద్ధ
- పెరుగుతున్న రోగుల సంఖ్య



లాలాపేటలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్



లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట ప్రాంతవాసులు చిన్న గాంధీ హాస్పిటల్‌గా పిలుచుకునే పట్టణ కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం(మెటర్నిటీ సెంటర్)లో కార్పొరేట్ తరహా వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు జిల్లా వైద్యాధికారులు చెబుతున్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నారు. దీనికి అనుగుణంగా ఇటీవల హాస్పిటల్‌లో అనేకమైన అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. ఇక్కడికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాలైన వైద్యం, వైద్య పరీక్షలు అందిస్తున్నారు. దీంతో రోజు రోజు కు హాస్పిటల్‌కు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది.

న్యూట్రీషన్ కిట్ల అందజేత..

30 పడకల హాస్పిటల్‌లో ప్రతి నెల దాదాపుగా 30కి పైగా ప్రసవాలు చేస్తున్నారు. గత నెల 43 ప్రసవాలు కాగా ఇందులో 21 వరకు సాధారణ ప్రసవాలు చేశారు. సాధారణ కాన్పుల కోసం ఇక్కడి వైద్యులు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నారు. బర్తింగ్ బాల్‌తో ఆంటినెంటల్ ఎక్సర్‌సైజ్‌లు చేయిస్తున్నారు. గర్భిణులు ఎక్సర్‌సైజ్‌లు చేసే విధానాన్ని టీవీ ద్వారా ప్రదర్శిస్తున్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ఎలాంటి జాండిస్ సోకకుండా యువి లైట్ సిస్టమ్ ఫొటో థెరపీని అందుబాటులోకి తీసుకువచ్చారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత సమస్యను అధిగమించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న న్యూట్రీషన్ కిట్లు అందజేస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఇటీవల ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.

మెరుగైన సేవలందిస్తున్నాం..



గత కొంత కాలంగా లాలాపేటలోని మెటర్నిటీ సెంటర్‌ను చాలా అభివృద్ధి చేశాం. బాలింతలు, గర్భిణులు, నవజాత శిశువులకు అన్ని రకాలైన వైద్య సేవలు, ల్యాబ్ పరీక్షలు అందుబాటు లో ఉన్నాయి. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోవద్దు, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం. –డాక్టర్ సునీత, డీసీహెచ్

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



శ్రమదానంలో పాల్గొన్న సీఈఓ మధుకర్ నాయక్, బోర్డు సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ అన్నారు. 'స్వచ్ఛత హీ సేవా' పేరిట బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం బోయిన్‌పల్లిలోని రామన్నకుంట చెరువు వద్ద శ్రమదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బోర్డు సభ్యుడు రామకృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ నేత మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, పాండుయాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భానుక మల్లికార్జున్, పరుశరామ్‌తో కలిసి ఆయన శ్రమదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అధికారులతో పాటు ప్రజలను ఇందులో భాగం చేయాలని భావించి సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 2న గాంధీ జయంతి వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అక్టోబర్ 1న కంటోన్మెంట్ వ్యాప్తంగా అన్ని వార్డుల్లో స్వచ్ఛత హీ సేవా పేరిట మెగా ఈవెంట్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. రామన్నకుంట ఎగువనున్న శ్రీనివాస నగర్ వాసులు తమ కాలనీలో శానిటేషన్ పరిస్థితి దారుణంగా ఉందని బోర్డు సిబ్బంది కనీసం ఫాగింగ్ కూడా చేయడం లేదని సీఈఓకు ఫిర్యాదు చేయగా తక్షణమే కాలనీని సందర్శించి తగిన చర్యలు చేపట్టాల్సిందిగా శానిటరీ సిబ్బందికి ఆదేశించారు.

జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలి



వీరన్నను సన్మానిస్తున్న దృశ్యం

లాలాపేట: త్వరలో జరుగనున్న ఎన్నికల్లో కుమ్మరి సామాజిక వర్గానికి జనాభా దామాషా ప్రకారం ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించాలని శాలివాహన కుమ్మరి వెల్ఫేర్ ట్రస్ట్ రాష్ట్ర నాయకులు వేలాద్రి, మల్లికంటి వీరన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఉప్పల్‌లో జరిగిన కుమ్మర్ల ఆత్మీయ సమ్మేళనానికి తార్నాక, ఓయూ క్యాంపస్ నుంచి పలువురు వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో కుమ్మర్లు రాణించాలన్నారు. ఇంత కాలం కుమ్మర్లకు సరైన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో అన్ని పాలక పక్షాలు పూర్తిగా విఫలమయ్యాయని ఇక నుంచైనా కుమ్మర్లు రాజకీయంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో మణికంఠ, వెంకట్, అప్పారావు, శంకర్, కృష్ణ పాల్గొన్నారు.

పేదల సౌకర్యార్థం మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్



మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: బేగంపేట పాటిగడ్డలో రూ.6 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 26న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద బేగంపేట డివిజన్‌కు చెందిన ముఖ్య నాయకులతో ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ఆదివారం సమావేశం నిర్వహించారు. పేద, మధ్య తరగతి ప్రజల సౌకర్యార్థం జీ ప్లస్–2 విధానంలో ఈ ఫంక్షన్ హాల్‌ను నిర్మించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, మాజీ కార్పొరేటర్ ఉప్పల తరుణి, నాయకులు శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్‌రావు, శేఖర్‌ముదిరాజ్, ఆరీఫ్, అక్బర్, అఖిల్, సలీం పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లకు ప్రతి నెలా వేతనం చెల్లించాలి



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో వివిధ డిగ్రీ కాలేజీల్లో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు గంటకు చొప్పున కాకుండా నెల నెల వేతనం చెల్లించాలని ఆదివారం తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చింతల కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. రాష్ట్రంలోని 132 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పని చేస్తున్న 1940 మంది గెస్ట్ లెక్చరర్లలకు గంటలకు రూ.390 చొప్పున చెల్లిస్తున్నారని నెలకు 72 క్లాసులకు రూ. 28,080 మాత్రమే చెల్లిస్తున్నారని వివరించారు. అధ్యాపకులకు గంట చొప్పున కాకుండా 12 నెలల పాటు గౌరవ వేతనం చెల్లించాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో ఫోరం ఉపాధ్యక్షులు నాగేశ్వర్‌రావు, కర్ణాకర్, సంతోష్, బండి శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, శేఖర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

లాలాపేట: తార్నాక డివిజన్ శాంతినగర్ ఆర్యనగర్‌లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలనీ బస్తీ నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత నాలుగేళ్ల నుంచి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో బస్తీలో జరిగే సామాజిక కార్యక్రమాలు నిలిచిపోతున్నాయని వాపోతున్నారు. బస్తీలో చాలా కాలంగా పాడైన పవర్ బోర్లకు మరమతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. దాదాపుగా 5 నెలలుగా సీసీ రోడ్డు నిర్మాణం నిలిచిపోవడంతో వృద్ధులు, పిల్లలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

220 పోలింగ్ కేంద్రాలు.. 20 రూట్లు

చిలకలగూడ : సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని 220 పోలింగ్ కేంద్రాలకు 20 రూట్లను కేటాయించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి యెల్లారెడ్డి తెలిపారు. డిప్యూటీ కమిషనర్ సుధాంశ్ ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఆదివారం ఎన్నికల సిబ్బంది, పోలీస్ అధికారులతో నిర్వహించిన సెక్టోరల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుని తమకు కేటాయించిన రూట్లతో పోలింగ్ స్టేషన్లను సరి చేసుకోవాలని సూచించారు. సెక్టోరల్ అధికారికి ఏఎస్ఐ స్థాయి పోలీస్ అధికారిని అటాచ్ చేసినట్లు వివరించారు. ఎన్నికల ప్రక్రియకు సర్వం సిద్ధం చేస్తున్నామని, సంబంధిత అధికారులు, సిబ్బంది, పోలీస్ అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ అర్చన, పోలీస్ అధికారులు, సెక్టోరల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓయూలో ముగిసిన వర్క్‌షాప్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో జరుగుతున్న అధ్యాపకుల వర్క్‌షాప్‌లో సినీ నటుడు కేవీ ప్రదీప్ పలు అంశాలపై ఉపన్యసించారు. ఆదివారం క్యాంపస్‌లోని సీఎఫ్ఆర్డీ (రౌండ్ బిల్డింగ్)లో మూడు రో జులుగా జరుగుతున్న వర్క్‌షాప్ ముగిసింది. ముగి ంపు కార్యక్రమానికి సీఎఫ్ఆర్డీ డైరెక్టర్ బూర్గుల సందీప్త అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ప్రదీప్ హాజరై మాట్లాడారు. అనంతరం వర్క్‌షాప్‌కు హాజరైన అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేశారు.

స్పౌజ్ బదిలీల్లో గందరగోళం సృష్టించొద్దు..

కాచిగూడ : ప్రస్తుత బదిలీల్లో ఉపాధ్యాయ స్పౌజ్ పా యింట్స్, స్పౌజ్ ఆప్షన్స్ పెట్టుకునే విషయంలో చాలా గందరగోళం సృష్టిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర స్పౌజ్ ఫోరం అధ్యక్షుడు వివేక్ ఆదివారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. జీవోలో 'నియర్ టూ అండ్ టువర్డ్స్ నియరర్ ప్లేసెస్ ఆఫ్ ది స్పౌజ్' అని చాలా స్పష్టంగా ఉందన్నారు. కొన్ని జిల్లాలో స్పౌజ్ మండలంలోని పాఠశాలను తప్పనిసరిగా ఆప్షన్ ఇవ్వాలని, ఇద్దరూ లాంగ్ స్టాండింగ్‌లో ఉన్నప్పటికీ ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్‌లో మెన్షన్ చేసిన స్పౌజ్ మండల్ స్కూల్స్‌నే మొదట ఆప్షన్‌గా పెట్టుకోవాలన్నారు. అనవసర రా ద్ధాంతం చేస్తూ.. స్పౌజ్ వారిని మానసికంగా ఇబ్బంది పెట్టేలా ప్రవర్తించిన వారి గురించి న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అంబర్‌పేట మండల్ రికగ్నైజ్డ్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ టాపర్స్–2023, ఉపాధ్యాయులను కేంద్రమంత్రి సన్మానించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలం చెందిందన్నారు. అనేక ప్రైవేటు విద్యసంస్థలు కూడా పేద, మధ్యతరగతి విద్యార్థులకు సేవలందిస్తూ.. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తుందన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు సేవాభావంతో విద్యను అందించాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికి హైలెవల్ కమిటీని వేసి వాటిని పరిష్కరించాలని కోరారు. విద్య పవిత్రమైందని ఉపాధ్యాయ వృత్తిని ఎన్నుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. అన్నికాలుగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ.. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు. తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు నిర్మాణమవుతుందని తెలిపారు. రూ.750 కోట్లతో నూతన రైల్వేకు శ్రీకారం చుడుతున్నామన్నారు. కార్పొరేటర్లు అమృత, పద్మ, స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవి, కోశాధికారి శోభారెడ్డి, సలహాదారులు శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్, శ్రీకాంత్‌రెడ్డి, కె.రవికుమార్ తదితరులున్నారు.



మైలార్‌గడ్డలో వినాయకుడిని దర్శించుకున్న నాగులూరి సాయిబాబా, నైవేద్యం సాయికుమార్

లంబోదరా..నమోనమః

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ పరిధుల్లో భక్తి శ్రద్ధలతో బొజ్జ గణపయ్యలకు ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఆయా ప్రాంతాల్లోని మండపాలను ప్రజాప్రతినిధులు, స్థానికులు సందర్శించుకున్నారు. మాణికేశ్వర్ నగర్‌లో ఓం గణేష్ తాపి కార్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని సినీ నటులు శివాజీ రాజా, శ్రీకాంత్ వర్మ, జబర్దస్త్ నటులు వల్లారపు శ్రీనివాస్‌కుమార్ దర్శించుకున్నారు. ఎస్ఆర్‌నగర్ ఎస్ఆర్‌టీ క్వార్టర్స్‌లోని మండపం వద్ద నిర్వాహకులు రాజా, దర్శన్, మహేష్, శ్రీనివాస్, సంతోష్, నారాయణ, రాజేష్, శ్రీధర్‌రెడ్డి దాదాపు మూడు వేల మందికి అన్నదానం చేశారు. –సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



సుభాష్‌నగర్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి పూజలు



సనత్‌నగర్‌లో: గణనాథుడిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నేత వెల్లాల రామ్మోహన్



లాలాపేటలో: అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బండా కార్తీకరెడ్డి



మాణికేశ్వర్‌నగర్‌లో పూజలో పాల్గొన్న సినీ నటులు శివాజి రాజా, శ్రీకాంత్ వర్మ



శివాజీనగర్‌లో గణనాథుడికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక



రెజిమెంటల్‌బజార్‌లో గణనాథుడికి పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు నందికంటి రవి



పూజలో పాల్గొన్న లాస్యనందిత, అనితప్రభాకర్, నళిని కిరణ్



రసూల్‌పురాలో పూజలో పాల్గొన్న సదా కేశవరెడ్డి



బీసీడీఎం ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో పూజలో పాల్గొన్న నయాబ్ తహసీల్దార్ రంజని



ఐడీహెచ్ కాలనీలో ఛాంపియన్ క్రికెట్ క్లబ్ రాజు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణేష్ మండపం



బెల్వీదర్ గార్డెన్-2 అపార్టుమెంట్‌లో..



అన్నదాన కార్యక్రమంలో రాజా, తదితరులు

పుస్తకావిష్కరణలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విప్లవోద్యమంలోని 52 మంది అజ్ఞాత మహిళలు రచించిన 282 కథల సంపుటి 'వీయ్యక్కా' పుస్తకాన్ని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ రచయిత డాక్టర్ విజయ భారతీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆమె మాట్లాడుతూ.. గత నాలుగు దశాబ్దాల విప్లవోద్యమంలో అనేక మంది విప్లవకారులు చాలా సాహిత్యాన్ని సృష్టించారన్నారు. గోండి భాషలో వీయ్యక్కా అంటే వేగు చుక్క అని అన్నారు. సమాజంలోని అన్ని రకాల మానవసంబంధాలు పెను మార్పులకు గురవుతున్నప్పుడు జరిగే ఘర్షణలకు సంబంధించిన కథలను రాశారన్నారు. పి.వరలక్ష్మి, రచయితలు కళ్యాణి కుంజ, ప్రొఫెసర్లు సునితారాణి, కాత్యాయని విద్యహే, తాయమ్మ కరుణ, అనురాధా తదితరులున్నారు.



కబోది చేపల కబుర్లు పుస్తకాన్ని, ఆవిష్కరిస్తున్న శివారెడ్డి

- ప్రముఖ రచయిత తెలుగు వెంకటేష్ రచించిన 4వ కవిత సంపుటి 'కబోది చేపల కబుర్లు' పుస్తకాన్ని ఆదివారం రాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత శివారెడ్డి మాట్లాడుతూ.. సమాజాన్ని కదిలించే ఇలాంటి పుస్తకాలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. రచయితలు ప్రసాదమూర్తి, సత్యశ్రీనివాస్, కవి యాకూబ్, మేర్సి మార్గరేట్ తదితరులున్నారు.



వీయ్యక్కా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి